**ఈ వారం కథ**

# తిరగబడ్డ ధర్మం

— సాక్షి

నాకు చిన్నప్పుడు గాడిద మీద ఎక్కి సవారీ చెయ్యాలని వుండేది. నేను విన్న రాజుల కథల్లోని గుర్రాలు నాకు కలలో కన్పించేవి. నేను రాజునై గుర్రాలెక్కి సవారీ చేస్తున్నట్లుగా అందమైన రాకుమార్తెల కోసం అన్వేషిస్తు న్నట్లుగా, అరివీర భయంకరుడినై శత్రువులతో పోరాడి వాళ్ళని మట్టి కరిపిస్తున్నట్లుగా కలలు కనేవాణ్ని. సినిమాల్లోనూ, కలల్లోనూ, క్లాసు పుస్తకాల బొమ్మల్లోను తప్ప నిజం గుర్రాల్ని నేనెప్పుడూ మా వూళ్ళో చూసిన పాపాన పోలేదు. అయితే కాస్త పొట్టిగా బలహీనంగా వున్నప్పటికీ మా వూరి చాకలి వాళ్ళ గాడిదలు మాత్రం నాకు అచ్చం గుర్రాల్లా కనిపించేవి.

వాళ్ళు బట్టలు వుతుకుతున్నపుడు ఏటి గట్టున ఫిలాసఫర్లలా దీర్ఘంగా ఆలోచిస్తు న్నట్లుగా నిల్చొని వుండే గాడిదలు నేను వాటి మీద ఎక్కి సవారీ చేస్తే నన్ను ఏమీ చెయ్యవని భరోసా యిస్తున్నట్లుగా కనిపించేవి.

తపస్సు చేసుకొంటున్న ఋషుల మీద చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరిపోయినా తమకేమీ పట్టనట్లుగా వుండిపోయినట్లే చాకళ్ళ బదులు నేను ఎక్కి సవారీ చేసినా అవి నన్ను ధిక్కరించవన్న ధీమా రోజూ వాటికేసి చూస్తున్నప్పుడు నాకు కలిగేది. అయితే వాళ్ళు ఏమైనా గొడవ పెడతారేమోనన్న భయంతో నేను ఆ సాహసం చెయ్యలేదు.

ఇహ ఇలా చూస్తూ వూరుకుంటే లాభం లేదని ఒక రోజు తెగించి, బట్టలు తీసుకెళ్ళడానికి వచ్చినప్పుడు అడిగాను "మీకు గాడిద వుందా?" అని.

వాడు నాకేసి ఆశ్చర్యంగా చూశాడు. "గాడిదలు లేకుండా మేమెలా బతుకుతాం బాబూ" అన్నాడు.

"అయితే రాములూ! రాములూ! నాకొక చిన్న సహాయం చెయ్యవూ..."

"ఏటి బాబూ" అని అడిగాడు వాడు. "చొక్కాలు నాలుగు" అని లెక్కేస్తూ.

"నీ గాడిదెక్కి ఒక్కసారి నన్ను సవారీ చెయ్యనివ్వవూ..." అన్నాను.

ఫక్కున నవ్వాడు వాడు ధోవతులు లెక్కపెడుతూ. "మీరేం తప్పు చేశారని గాడిదెక్కి ఊరేగుతానంటున్నారు" అన్నాడు.

వాడన్న దాంట్లో ఆంతర్యం నాకు బోధపడలేదు. "మీ పిల్లలు ఏం తప్పు చేశారని వాళ్ళని రోజూ గాడిదెక్కించి తిప్పుతున్నావ్" అన్నాను ఉక్రోషం పట్టలేక.

వాడు పడీ పడీ నవ్వాడు. యింతలో మా నాన్నగారు రావడంతో "వస్తానండీ బాబయ్యా" అని బట్టల మూట తీసుకుని బయటపడ్డాడు.

వెధవ గాడిద లున్నందుకే వెధవకి ఇంత గీరైతే, ఆరు పాడి గేదెలూ, రెండు ఆవులూ, మూడు జతల ఎడ్లూ వుండి, కావాలనుకొంటే పాతిక గుర్రాల్ని కొనగలిగి వుండి కొనకుండా వుండిపోయిన మా నాన్నగార్కి, నాకూ ఎంత గీర వుండాలి? మాడు మా నాన్నగార్కి చెప్పి రేపీపాటికి నా గాడిదల్ని తెచ్చి మా యింటి ముందు కట్టేయించకపోతే నా పేరు క్రిష్ణుడు కాదు అని నాలో నేను శపథం చేసుకున్నాను.

"స్కూల్‌కి వెళ్ళవేరా గాడిదా" అని అరిచారు మా నాన్నగారు. ఉలిక్కిపడి వెనక్కి తిరిగి హడావిడిగా తయారై స్కూలుకి బయలుదేరాను, గాడిదలు స్కూలుకి వెళ్ళవు గామోలు అనుకుంటూ.


మా నాన్నగారు అవడానికి వూళ్ళో పెద్దపులి లాంటివారు. నేమా అంతకు తక్కువ వాణ్ణేం కాదు. అయితే ఎంత పులినైనా పెద్దపులంటే చిన్న పులులకి కాస్త బెదురుగానే వుంటుంది కదా! అందుచేతే మా నాన్నగారికి ఎదురుపడి మాట్లాడా లంటే నాకు కాస్త బెరుగ్గా వుండేది. గాడిదెక్కి సవారీ చెయ్యాలన్న చిరుకోరికని తీర్చమని కోరడానికి తగిన సమయం కోసం కాచుకొని వున్నాను.

నాకు రాత్రుళ్ళు తెల్లటి గుర్రాలు స్లో మోషన్లో పరిగెట్టుకొస్తున్నట్టుగా కనిపించేవి. అకస్మాత్తుగా ఎక్కడినించో తెల్లటి మంచు పొగలు పొంగి పొర్లిపోగా అందులో గుర్రాలు కరిగిపోయి వాటి స్థానే గాడిదలు ప్రత్యక్షమయ్యేవి. అందులో ఢిల్లీ గాడిద వంటి ఒక జబర్దస్తీ గాడిదని ఎంచుకుని దానిపై ఎక్కి గగన విహారాలు చేసేవాణ్ని.

అడుగుదాం అడుగుదాం...మా నాన్నగార్ని యివాళ అడుగుదాం, రేపు అడుగుదాం అనుకుంటుండగానే మా వూళ్ళో ఒక చిన్న సంఘటన జరిగింది.

ఆ వేళ ఆదివారం. స్కూల్ లేదు. మధ్యాహ్నం పూట చెరువు గట్టున వున్న రావి చెట్టుకు వుయ్యాలలు కట్టి ఊగుతూ రకరకాల ఆటల్ని సృష్టించుకుని ఆడు కొంటున్నాం మేము. ఉన్నట్టుండి ఎక్కడి నించో దూరాన్నుంచి "డం...డం... డం...డముకుడం...డం, డండం...డముకుడం" అని ముందు లీలగా, ఆ తరువాత పెద్ద పెట్టునా వినిపించింది. ఆ శబ్దం దగ్గరకి వస్తున్న కొద్దీ నాలో నేను కలిసి పోతున్నప్పుడు నా గుండె చప్పుడు నాకు వినిపించి భయపెట్టినట్లయింది. ఉయ్యాల ఊగటం మానేసి, నా ప్రక్కనే వుయ్యాల వూగుతున్న మా క్లాస్‌మేట్ వెంకట్‌గాణ్ని 'ఏవిటిరా ఆ చప్పుడు' అని అడిగాను.

వాడు మాత్రం ఏం చెబుతాడు. అది పెళ్ళి వాయిద్యం కాదు. చావు డప్పూ



కాదు. అది ఏదో పైశాచిక నృత్యం చేస్తూ సృష్టిస్తున్న బీభత్స రసంలా వుంది. అసలే మా వెంకట్‌గాడు మహా పిరికి. ఈ చప్పుడుని బాగా ఆలకించిన తరువాత చుట్టుపక్కల పెద్దవాళ్ళు ఎవరూ లేకపోవడం చూసి "బాబోయ్" అని అరుస్తూ, భయంతో ఉయ్యాల మీద నించి దూకి పారిపోయాడు.

ఇంకా ఉయ్యాల ఊగుతున్న ప్రెసిడెంట్ గారి అబ్బాయి అనిల్ వాణ్ణి చూసి ఫక్కున నవ్వాడు. "ఏం చప్పుడురా అది" అని అడిగాను వాణ్ణి.

"అదా...అది మన వెంట్రెంకడు లేడూ..." ఆడు మునసబుగారింట్లో కొబ్బరి బోండాలెత్తుకు పోతూ దొరికాడట. యివాళ పంచాయతీ పెట్టి వాడికి శిక్ష వేసి నట్లున్నారు" అని చెప్పాడు వాడు.

ఊళ్ళో పంచాయతీ పెట్టి శిక్ష వెయ్యడమంటే ఏం చేస్తారో నాకు అప్పటి వరకూ తెలియదు. అదేమిటో చూద్దామన్న కుతూహలంతో ఉయ్యాల మీది నించి దూకి పంచాయతీకేసి పరుగెట్టాను. దార్లో ఒక గాడిద మీద వెంట్రెంకణ్ణి ఎక్కించి ఊరేగిస్తున్నారు. వెంకడికి గుండు చేశారు. ఒంటి మీద చెడ్డీ తప్ప ఏమీ లేకుండా చేశారు. నల్లటి మసితోటి, సున్నం తోటీ, పసుపుతోటీ వాడి ఒంటిమీదా, మొహంమీదా, నెత్తిమీదా బొట్లు పెట్టారు. రెండు చేతులూ వెనక్కి విరిచి కట్టారు. మాదిగ వాళ్ళు డప్పు వాయిస్తున్నారు. నాకంటే పెద్ద పిల్లకాయలు కొందరు రాళ్ళు తీసుకుని వెంకడి కేసి విసిరి కొడుతున్నారు. రాయి తగిలినప్పుడల్లా వాళ్ళు వుత్సాహంతో ఈలలు వేస్తూ కేరింతలు కొడుతున్నారు. అక్కడక్కడ వెంకడి వొంటి మీద దెబ్బలు తగిలి రక్తం కారుతోంది.

గాడిద రాళ్ళ దెబ్బలు తప్పించుకోవడానికి అటూ ఇటూ నడుస్తోంది. దాని వాలకం చూస్తే ఏ క్షణాన్నయినా వెంకణ్ణి కింద పడేసేలాగుంది. తప్పించుకోవడానికి అవకాశం లేక వెంకడు, గాడిద మీద వుత్సవ విగ్రహంలా వుండిపోయాడు.



గాడిద నెక్కి సవారీ చెయ్యాలన్న నా కోరిక గుర్తుకు వచ్చి నిలువునా ఒణికి పోయాను.

నేను పెరిగి పెద్దవాణ్ణయి ప్లీడర్ని అయాను. అప్పటికి మా తాతల నాటి ఆస్తి కరిగిపోయి, పూర్తిగా అడుగంటి పోయింది. అడుగూ బొడుగూ గీక్కోడానికి తప్ప నాకూ, మా అన్నయ్యకీ పిత్రార్జితం అంటూ పెద్దగా మిగల్లేదు. అందుచేత మా తాతలు నేతులు తాగిన వూళ్ళో చెడి బ్రతకడం కంటె చిరుగుల చొక్కా, చిరుగుల బనీమలపైన దర్జాగా నల్లకోటు వేసుకుని పట్నంలో ప్రాక్టీస్ పెడితే ఘనంగా బ్రతకవచ్చనిపించింది.

నేను ప్రాక్టీసు పెట్టిన కొత్తలో నన్ను బాగా ఎరిగివున్న వాళ్ళు నా దగ్గరికి వచ్చి తమ తమ సమస్యల్ని క్షుణ్ణంగా చర్చించేవాళ్ళు. ఏం చేస్తే బాగుంటుందో చెప్పమని సలహా అడిగేవారు. నేను ఏ డిక్లరేషన్ సూట్ వెయ్యాలని చెప్పగానే "అయితే ఈ డిక్లరేషన్ సూట్ ఎవరితో వేయిస్తే బాగుంటుందో చెప్పవోయ్" అని అడిగేవారు.


నేను ప్లీడర్నని ఎరిగి వుండి కూడా నాకు కావలసిన వాళ్ళు నన్ను యిలా అడగ్గానే నాకు ఒళ్ళు మండిపోయేది.

"నా తెలివితేటల్ని యింత తక్కువగా అంచనా వేసే నా మీద విశ్వాసం లేని స్నేహితులూ, బంధువులూ నా కెందుకటా" అనుకుని నా మీద నేనే విసుక్కొనే వాణ్ణి. పరిస్థితులు యిలాగే వుంటే ఇహ నా ప్రాక్టీస్ పెరిగినట్లే నమకొని దిగులుపడే వాణ్ణి. నా పరిస్థితి చూసి మా మామయ్య "ఈ రోజుల్లో తెలివి తేటల్నీ, చదువు సంధ్యల్నీ ఎవరూ చూడరోయ్! నీ డబ్బునీ, దర్జానీ అందరూ చూస్తారు. నీకొక కారుండి యిద్దరు నౌకర్లుండి, ఓ గుమాస్తానీ, ఓ టైపిస్టునీ, ఓ స్టెనోగ్రాఫర్నీ పెట్టుకోగలిగివుండి నువు చదివినా చదవక పోయినా యింటినిండా పుస్తకాల్తో ఒక లైబ్రరీ మెయింటైన్ చెయ్యగలిగి వుంటే, నీ అంతటి ప్లీడర్ లేడని ఈ వూరు ఊరంతా చెప్పకొనేవారు. నీకు పిల్ల నివ్వాలన్నా సరే...ఎవరైనా చూసేది నువు అసలు మగాడివి అవునా కాదాని కాదు. నీకున్న ఆస్తిపాస్తుల్నీ, నీ డబ్బునీ, దర్జాల్నీ. అందుచేత నా మాట విని నీ వాటాకొచ్చిన భూమి తెగనమ్మి నీ ప్రాక్టీస్‌కి పెట్టుబడి పెట్టవోయ్! ఆ తరువాత లాభాలు వాటంతటవే వస్తాయి" అని సలహా చెప్పాడు.

ప్లీడర్‌కు వుండాల్సిన అన్ని లక్షణాలు వుండి కూడా నాకు ప్రాక్టీస్ పెరగక పోవడం చూస్తే మా మామయ్య చెప్పిందాంట్లో నిజం లేకపోలేదనిపించింది. రాను రానూ నా మీద నాకు విశ్వాసం సన్నగిల్లి డబ్బుమీద విశ్వాసం పెరిగింది. మా అన్నయ్యని ఒప్పించి ఊళ్ళో వున్న భూమి అమ్మి కొన్ని పుస్తకాలు కొన్నాను. ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్ టేబులూ, ఒక రివాల్వింగ్ చైరూ, క్లయింట్ల కోసం సోఫా సెట్టూ కొని ఆఫీసుని అలంకరించాను. ఈ దాబూ దర్పం అంతా నేను చిరుగుల చొక్కా బనీన్ల మీద వేసుకున్న నల్లకోటులాగా నా ఆఫీస్ రూంకి మాత్రమే పరిమితమైంది. అయితే కాలక్షేపానికి మా ఆఫీస్ కొచ్చిన వాళ్ళంతా నిజంగా నా ప్రాక్టీస్ పెరిగిందను కొన్నారు. ఒకరిద్దరు స్నేహితులు, డబ్బుతో నా ఆఫీసు రూమ్‌లో వచ్చిన మార్పులు చూసి, నామీద విశ్వాసాన్ని పెంచుకుని అంతకు ముందు పరాయి ప్లీడర్ల కిచ్చిన కేసులు తీసుకొచ్చి నాకిచ్చారు.

నెమ్మదిగా స్నేహితులూ, బంధువులూ కేసులు యివ్వడం మొదలుపెట్టారు. అంతా తెలిసిన వాళ్ళే తప్ప పరాయి వాళ్ళెవరూ కేసులు యివ్వడం లేదు. ఎంతయినా ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు. యింట గెలిచాను. ఇహ ఎలాగయినా సరే రచ్చ గెలవాలి. అందుచేత మా పనివాడికి తెల్ల చొక్కా, పాంటూ, ఎర్రటి తలపాగా, నడుముకు చుట్టుకోడానికి ఒక ఎర్రటి పట్టీ కుట్టించి తొడిగించాను. చూడ్డానికి వాడు అచ్చు కోర్టు బంట్రోతులా తయారయ్యాడు. ఒక పొన్ను కర్రకి వెండి పూత పూయించి వాడికిచ్చి నిలబెట్టాను. వాడు మహారాజుల శయన మందిరానికి కావలి కాసే వాడిలా వున్నాడు. ఈ వేషధారణ వాడికీ బాగా నచ్చింది. సినిమా యాక్టరయి పోయినట్లు మురిసిపోయాడు.

"రేపట్నించి తెల్లారగానే మన యింటి ముందర అటెన్షన్‌లో నిల్చో. మధ్యాహ్నం భోజనానికీ, రాత్రి నిద్రకీ తప్ప యింక ఎప్పుడూ అక్కడి నించి కదలకు. ఇవ్వాల్టి నించీ అదే నీ వుద్యోగం, డ్యూటీ...మనింటికి వచ్చే పోయేవాళ్ళకి వినయంగా వంగి వందనం చెయ్యి" అని ఆజ్ఞాపించాను. మర్నాడు తెల్లవారగానే వాడు వెళ్ళి వీథిలో డ్యూటీ చెయ్యడం మొదలుపెట్టాడు. మా యిల్లు హౌసింగ్ బోర్డు అపార్ట్‌మెంట్స్ మొదటి అంతస్తులో వున్నందువల్ల వాడు మా యింటికి వచ్చే వాళ్ళెవరో, ఆ పై ఇళ్ళకి వెళ్ళే వాళ్ళు ఎవరో పోల్చుకోలేక మా అపార్ట్‌మెంట్స్‌కు వచ్చే ప్రతీ వాళ్ళకీ వంగి వందనం




వెయ్యసాగాడు. ఈ మర్యాద చూసి రోడ్డు మీద వచ్చే పోయే వాళ్ళంతా మా అపార్ట్‌మెంట్‌లో ఏదో బార్ షాపు వెలిసిందనుకొన్నారు.

సందుల్లో సారా కొట్లకీ, సంసారుల్లో సానులకీ ఎక్కువ గిరాకీ వుంటుంది. బార్ షాపు అనుకుని మా యింటికి వస్తున్న వారి సంఖ్య రోజు రోజుకీ పెరగ సాగింది. ఇలా వస్తున్న వాళ్ళు మాది బార్ షాపు కానందుకు కించిత్తు నిరుత్సాహ పడినా నా హుందానీ, హోదానీ, దర్జానీ చూసి తమలో తాము నన్ను అభినందించుకొని నా గురించి బోల్డు ప్రచారం చేశారు. నేను వూహించినట్లుగానే నా ప్రాక్టీస్ బాగా పుంజుకుంది.

ఒక రోజు సేట్ చమన్‌లాల్‌గారు తన బంగారపు కొట్టు కట్టేసి, అలసట తీర్చుకోవడానికని గల్లీల్లో బార్ షాపుల కోసం వెతుకుతూ మా యింటికి వచ్చారు. తాను అడుగుపెట్టింది బార్ షాపు కాదని తెలుసుకుని చుట్ట చుట్టుకుని పడుకున్న పాముమీద కాలు పెట్టినట్టుగా ఉలిక్కిపడి వెనక్కి తిరిగి "సారీ‌పొరపాటైంది సార్" అంటూ వెళ్ళబోతూ, గోడలకి వున్న షెల్ఫ్‌లో అందంగా అమర్చిన లా పుస్తకాలు చూసి ఆగిపోయి "మీరు ప్లీడరా సార్" అని అడిగాడు.

అవునన్నట్లుగా తల పంకించేను కూర్చున్న చోట నించీ కదలకుండానే. తాను కాలు పెట్టింది కాటు వేసే పాముమీద కాదనీ, అభయం యిచ్చి ఆశీర్వదించే పాముదనీ తెలుసుకున్నట్టుగా అతి భక్తితో చేతులు జోడించి నమస్కారం పెడుతూ తిరిగి లోపలికి అడుగు పెట్టాడు సేట్ చమన్‌లాల్.

"కూర్చోండి" అని లేచి నిల్చొని సోఫా చూపించేను. సేట్‌గారు తన భారీ కాయాన్ని సోఫా మీద వుంచగానే సోఫా మెత్తగా ఒదిగిపోయింది. చెప్పండన్నట్లు చూశాను ఆయనకేసి.

"నాదొక చిన్న సమస్య అండీ" అన్నాడు సేట్ చమన్‌లాల్ దిక్కులు చూస్తూ.

"చెప్పండి ఫరవాలేదు" అన్నాను.

"నేను వుంచుకున్న ముండ, దానికీ దానికి పుట్టిన బిడ్డకీ, పుట్టబోయే బిడ్డకీ నెలకి వెయ్యి రూపాయిలు మనోవర్తి ఇవ్వమని కేసు వేసిందండి" అని చెప్పాడు సేట్ కసిగా పళ్ళు పటపట నూరుతూ.

"బాగుంది, యివాళ మనోవర్తి ఇవ్వమంటుంది, రేపు ఆస్తిలో వాటా యివ్వమం టుంది, దాన్దేం పోయిందీ" అన్నాను.

"ఆస్తిలో వాటా కూడా అడగొచ్చునా అండీ" అని సందేహం వ్యక్తపరిచాడు సేట్ చమన్‌లాల్.

"అడగొచ్చును. అది మీరు చేసుకున్న పెళ్ళాం కాకపోయినా, దానికి పుట్టిన బిడ్డలు మీ బిడ్డలే కనుక, చట్టబద్ధంగా వాళ్ళు మీ ఆస్తికి వారసులవుతారు"

సేట్‌జీకి భయంతో చెమటలు పోశాయి.

"మీరేమీ కంగారు పడకండి. ముట్టు గుడ్డని జేబు రుమాలుగా వాడుకొనమని ఎవరైనా చెబుతారా! తీసి మురికి గుంటలో విసిరెయ్యమంటారుగానీ! కేసులో ఆమె గెలిచిందంటే ముట్టుగుడ్డని జెండా చేసి ఎగరేసినట్టన్న మాట. నేనుండగా అలా జరగనివ్వను" అని భరోసా ఇచ్చాను.

సేట్‌జీ సంతోషించి కేసు అప్పగించి ఎడ్వాన్స్‌గా కొంత ముట్టచెప్పారు. "ప్రస్తుతానికి యిది వుంచండి. కేసు గెల్చిన తరువాత మా యింట్లో బంగారం పండిస్తా నండీ" అని హామీ యిచ్చారు.

సేట్ చమన్‌లాల్ గారికీ, ఆయన వుంపుడుగత్తెకీ ఏమీ సంబంధం లేదనీ, అసలు చమన్‌లాల్‌గారు ఆవిడని ఎప్పుడూ చూసి ఎరగరనీ, కాబట్టి చమన్‌లాల్‌గారి వల్ల ఆవిడకి పిల్లలు పుట్టే అవకాశం లేదనీ, అందుచేత ఆవిడక్కానీ, ఆవిడకి పుట్టిన బిడ్డక్కానీ, పుట్టబోయే బిడ్డక్కానీ ఆయన మనోవర్తి చెల్లించనవసరం లేదనీ కేసులో జవాబు రాసి పడేశాను.

కేసు విచారణలో వుండగా ఒక సాక్షిని ప్రవేశపెట్టాను. "బాబూ! భగమంతుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. అదిగదిగో అక్కడ నిల్చొన్న యీ కేసు పెట్టిన ఆడ మనిషి మీద, అదే బాబూ నేను కట్టుకున్న పెళ్ళాం మీద, దానికీ నాకు పుట్టిన ఆ బిడ్డమీద, దాని కడుపులో పెరుగుతున్న మా బిడ్డమీద ప్రమాణం చేసి అళ్ళంతా ఒక్కసారే వచ్చిపోయినంత ఒట్టు పెట్టుకుని చెబుతున్నాను బాబూ! అది నా పెళ్ళాం. ఆ బిడ్డ నా బిడ్డ. దాని కడుపులో పెరుగుతున్న బిడ్డ కూడా నా బిడ్డే. దాన్ని నాతో పంపితే కడుపులో వల్ల కదలకుండా పువ్వుల్లో పెట్టి పోయించుకుంటాను బాబూ" అని ఆగి తల ప్రక్కకి తిప్పి సేట్ చమన్‌లాల్ గారికేసి చూస్తూ "బాబూ! దాని తప్పు కాయండి. భగమంతుడు లాంటి మీమీద నింద వేసింది. అనరాని మాటలంది" అన్నాడు.

ఇంతలో మేజిస్ట్రేట్‌గారు కల్పించుకొని "యిది కోర్టన్న విషం మర్చిపోవద్దు. ఇక్కడ సాక్ష్యం చెబితే చెప్పు, మాన్తే మాను. అంతేకాని నీకిష్టం వచ్చిన వాళ్ళతో నీకిష్టం వచ్చినట్టుగా బోనులో వుండి మాట్లాడ్డానికి వీల్లేదు" అన్నారు.

"చిత్తం! అలాగేనండీ!" అన్నాడు సాక్షి. మెజిస్ట్రేట్ గారికేసి తిరిగి బుద్ధిమంతు డిలా.

"వీడెవడో నాకసలు తెలవదు. వీడుత్త అబద్ధాల కోరు. వీడి మాటలు నమ్మకండి" అని అరిచింది సేట్ చమన్‌లాల్ గారి వుంపుడుగత్తె.

"ఇది కోర్టనుకున్నావా! చేపల మార్కెట్ అనుకున్నావా" అని కసురుకున్నారు మెజిస్ట్రేట్ గారు.

కోర్టువారికి ఎదురు చెప్పలేక ఆ ఆడది కుళ్ళికుళ్ళి ఏడ్చింది. ఆమె తరపున ప్లీడరు ముక్కుబడిగా నాలుగు ప్రశ్నలు వేసి క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయిందనిపించాడు.

ఆ తరువాత కేసులో వాదోపవాదాలు జరిగాయి. కేస్ కొట్టివేశారు. సేట్ చమన్‌లాల్ వంటి మర్యాదస్తుడి మీద తప్పుడు కేసు పెట్టినందుకుగాను ఆ ఆడ మనిషిని కోర్టు మెత్త మెత్తగా మందలించింది. తప్పుడు కేసు పెట్టినందుకు సేట్ చమన్‌లాల్‌కి ఆ ఆడదాని మీద చట్టబద్ధంగా తగిన చర్య తీసుకునే హక్కు వుందనీ, ఆ పని ఆయన యిష్టాయిష్టాలమీద వేస్తే చెయ్యనూ వచ్చని, మాన్తె మానమూ వచ్చనీ కోర్టువారు తెలియజేశారు.


ఆ ఆడది ఏడ్చిన ఏడుపు ఏడవకుండా, పెట్టిన శాపనార్థాలూ పెట్టకుండా నానా యాగీ చేసేసింది.

కోర్టు బంట్రోతులూ, కోర్టు డ్యూటీకి వచ్చిన పోలీసులూ దాన్ని ముప్పిరిగొని వాళ్ళ పిచ్చికుక్కని పట్టుకొని యీడ్చేసినట్టుగా యీడ్చేస్తే తప్ప అది ఒక పట్టాన కోర్టు హాల్లోంచి బయటకు కదల్లేదు.

"కలికాలం కాబట్టే ఆడదిలా బరి తెగించింది. కాకపోతే కానివాళ్ళె పట్టుకొని తమ కన్న కొడుకుని కన్నవాడంటుందా, హన్నా" అనుకుని ముక్కుమీద వేలు వేసుకున్నా రంతా.

యిలాగ యీ కేస్ గెలవడంతో సేట్ చమన్‌లాల్ నాకు బ్రహ్మరథం పట్టాడు. ముందుగా అనుకున్న దానికంటే ఫీజు ఎక్కువగానే ముట్టచెప్పాడు.

నా ప్రాక్టీస్ బాగా పుంజుకుంది. కారు కొనుక్కుంటే రోజూ కోర్టుకు ఘనంగా వెళ్ళిరావచ్చుననిపించింది. నా ప్రోమసుకి నేను అర్జంటుగా వున్నపళాన ఎవరిదగ్గరైనా అప్పు చెయ్యకుండా కారు కొనడమంటే మాటలు కాదు. ఒకవేళ క్రిందా మీదా పడి కొన్నా హోండా కార్లూ, కాంటెస్సా కార్లూ వేసుకుని కోర్టుకొచ్చే ప్లీడర్ల ముందు దిగదుడుపే కదా, అందుచేత కారంటూ కొంటే మిగతా వాళ్ల కళ్లల్లో కారం కొట్టి మంటపుట్టించినట్టుగా వాళ్లందరి అమ్మామొగుడులాంటి కారు కొనాలి. ఎలాగూ ఇప్పట్లో అలాంటి కారు కొనలేరు. కాబట్టి ఒక మాంచి గుర్రాన్ని కొనుక్కొని గుర్రం ఎక్కి కోర్టుకు వెళితే దానిముందు హోండా కార్లూ, కాంటెస్సాలూ కూడా దిగదుడుపే. నేను నల్ల పాంటూ తెల్లచొక్కా వేసుకొని, బ్యాండ్స్ కట్టుకొని, నల్ల




కోటు తొడుక్కొని, గౌను వేసుకుని గుర్రం మీద కోర్టుకు వెళుతుంటే చూడాలి దేవలోకం నుంచి దిగివచ్చిన దేవేంద్రుడిలా వెలిగిపోతుంటాను. ఇంతకాలం స్వతంత్రం పేరిట తాము కన్నది కలలేనని ఆ కలలు కరిగిపోయి కల్లలైపోగా ఇంకా తెలుగువాట తెల్లవాడే ఖాకీ గుడ్డలతోటే, నల్లకోట్లతోటే, చట్టాలతోటే ఏలుతున్నాడన్న నిజం గ్రహించినట్టుగా, ఠీవిగా, అందంగా, హుందాగా తెల్ల దొరలా వున్నాన్నేను గుర్రం ఎక్కి సవారీ చేస్తుంటే.

చూసిన జనం ఒంగి ఒంగి దండాలు పెడతారు. నా దేశాన్నే నేను పరాయి దేశాన్ని ఏలినట్టుగా ఏలవచ్చునను కొని వూహించుకొని వెంటనే గుర్రం కొనాలని నిశ్చయించుకున్నాను.

నేను అనుకున్నదానికంటే తక్కువలోనే ఓ మంచి గుర్రాన్ని కొనగలిగాను. దానికి రోజూ మేత వేసి మాలిష్ చెయ్యడానికి ఒక మనిషిని పెట్టాను. గుర్రం తెల్లగా బలంగా వుంది. దాని ఒంటి మీద అక్కడక్కడా నల్ల మచ్చలున్నాయి. నుదుటి మీద గోధుమ రంగులో ఒక మచ్చ వుండడంతో ఆ గుర్రం కళకళలాడుతోంది. దాన్ని చూడగానే ఎవరికైనా సరే చురుకైన గుర్రం అనిపిస్తుంది.

ఒకవైపున గుర్రాన్ని మచ్చిక చేస్తూనే మరోక వైపు రైడింగ్ క్లబ్‌లో గుర్రపుస్వారీ నేర్చుకొన్నాను. ఒక మంచిరోజు చూసుకుని గుర్రం మీద కోర్టుకు వెళ్లాలనుకున్నాను.

మా పనివాడికి రోజూ ప్రొద్దున్నే తొమ్మిదిన్నరకల్లా గుర్రాన్ని సిద్ధం చెయ్యమని ఆజ్ఞాపించాను. గుర్రం మీద కోర్టుకు బయలుదేరేరోజు పూజార్ని పిలిపించి గుర్రాన్ని వీధిలో నిలబెట్టి పూజ చేయించాను. వీధిలో వున్న జనమంతా విరగబడి చూశారు. అందరూ అలా చూస్తుండగా సింహాసనాన్ని అధిష్టిస్తున్న మహారాజులా యమదర్జాగా మా పనివాడితో ఒక స్టూల్ తెప్పించుకుని దానిపైన ఎక్కి ఆ పైన గుర్రం ఎక్కి కోర్టుకు బయలుదేరాను.

కోటు తొడుక్కొని గౌను వేసుకుని దర్జాగా గుర్రంమీద వెడుతున్న నన్ను చూసి జనం ఆశ్చర్యంతో నోళ్లు తెరిచి ఎక్కడున్నవాళ్లక్కడే వుండిపోయారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ సైడ్ చూపించడం మానేసి యమలోకం నుంచి చెప్పాపెట్టకుండా దిగివచ్చిన యముణ్ని చూసిన యమభటుడిలా నాకు అర్జంటుగా సెల్యూట్ చేశాడు. నేను చిరునవ్వుతో తల పంకించాను.

అలాగ అతి భక్తితోను, అతి గౌరవంతోను అతి మర్యాద చేస్తున్న జనం మధ్యనించి ఠీవిగా ఆబిడ్స్ సెంటర్ చేరుకున్నాను. దూరం నుంచి నన్ను చూసిన సేట్ చమన్‌లాల్ బంగారపు కొట్లోంచి బయటికి వచ్చి తన బంగారపు దంతం కనిపించేలా పళ్లన్నీ బయటపెట్టి నవ్వుతూ నాకు దండం పెట్టి "గవర్నర్ తరువాత, ప్రధాన న్యాయమూర్తి తరువాత మీరేనండీ. మీ అంత దర్జా మరెవరికీ రమ్మన్నారాదు" అన్నాడు. అవునన్నట్టు చిరునవ్వుతో సమాధానం చెప్పి ముందుకు కదిలాను.

జడ్జీల కార్లు రాగానే పరుగెత్తుకు వెళ్లి వినయంగా తలుపులు తీసి నిల్చొనే కోర్టు బంట్రోతులు, గుర్రం మీద నేను కోర్టుకు చేరుకోగానే వచ్చి గుర్రపు కళ్లెం పట్టుకొని జాగ్రత్తగా నన్ను కిందికి దింపారు.

కోర్టులో వున్న కేసులు చూసుకోడానికి వచ్చి ఆ చెట్టు కింద, ఈ చెట్టు కిందా వున్న పార్టీలు నన్ను చూసి ఆశ్చర్యపోయారు. నేను ఇంత గొప్ప ప్లీడర్నని ఎరక్కపోయి నన్ను పెట్టుకోనందుకు దిగులుపడ్డారు.

ఆ సాయంత్రమే నాకొక సెన్సేషనల్ మర్డర్ కేస్ వచ్చింది.

"నా పేరు రాజయ్యండి. నన్ను కత్తి రాజయ్యంటారు" అని చెప్పి నమస్కారిం చాడు కొత్తగా వచ్చిన పార్టీ.

"మిమ్మల్ని ఎరక్కపోవడమేమి? రండి కూర్చోండి" అని కుర్చీ చూపించాను.

కత్తి రాజయ్యంటే ఊళ్లో పేరుమోసిన రౌడీ, ప్రజలు మొదలుకొని పోలీస్ డిపార్ట్‌మెంట్ వరకూ ఎవరికైనా సరె, వాణ్ణి చూడగానే గుండెల్లోరైళ్లు పరుగెడతాయి. ఈ మధ్యనే వాడు అడగ్గానే మామూళ్లు ఇవ్వనందుకుగాను పట్టపగలు నలుగురూ చూస్తుండగానే ఒక షావుకార్ని రోడ్డుమీదకీడ్చుకొచ్చి కత్తితో పొడిచి చంపాడు. అప్పటినుంచి వాడు పోలీస్ రికార్డ్‌లో వాంటెడ్ పర్సన్. మా వూళ్లో వాడొక గాడ్ ఫాదర్. వాడు కత్తి పట్టాడంటే అధవా ఓ మర్డర్ జరగాల్సిందే. వాడు మా ఊళ్లో అనధికారికంగా అధికారం చెలాయించే ముఖ్యమంత్రే. వాడు నా క్లైంట్ అయ్యాడంటే నాకు నేను ప్రత్యామ్నాయ ప్రభుత్వానికి అడ్వకేట్ జనరల్నయినట్టే.

"చెప్పండి" అన్నాను అతనికేసి తీక్షణంగా చూస్తూ. అతను అయిదడుగులెత్తు వున్నాడు. పొట్టిగా వున్నా దృఢంగా వున్నాడు. చాచికొడితే బండరాయైనా విరిగి ముక్కలయ్యేట్టున్నై అతని చేతులు బలంగా.

"సార్! నా మీద ఈ మధ్యన ఒక మర్డర్ కేస్ రిజిస్టర్ అయిన సంగతి మీకు తెలుసుకదా! ఎలాగైనాసరే ఒక్క రోజు కూడా జైలుకు వెళ్లకుండా నన్ను ఈ కేసులోంచి బయటికి తియ్యాలి" అని అడిగాడు రాజయ్య.

నేను ఒక్క నిమిషంసేపు గంభీరంగా ఆలోచిస్తూ కూర్చున్నాను.

"సార్ మీరు గుర్రం మీద కోర్టుకు వెళుతుంటే చూసి మమ్మల్ని కాపాడగలిగే మహారాజు మీరేనని ఎంచుకొన్నాను సార్" అన్నాడు కత్తి రాజయ్య నేను కేసు తీసుకోడానికి సంకోచిస్తున్నాననుకొని.

"అదే అదికాదు. నువ్వు మర్డర్ చేస్తుండగా చూసిన వాళ్లున్నారు కదా! మరలాంటప్పుడు నిన్ను ఒక్కరోజయినా జైలుకు పంపకుండా బయటికి తియ్యట మెలాగ అని ఆలోచిస్తున్నాను" అన్నాను.

"చూడటమంటే ఒకరిద్దరు చూడటం కాదుసార్. మొత్తం ఊరు ఊరంతా విరగబడి చూసింది. నిజంగా మర్డర్ జరిగితే ఎలా వుంటుందో చూడాలన్నట్టుగా చూశారు. ఒక్క నాకొడుక్కి కూడా గుండె ధైర్యం లేకపోవడం వల్ల అడ్డుపడకుండా నిలువుగుడ్లేసుకొని చూస్తూ వుండిపోయారు. కాబట్టి చూసిన కొడుకెవడూ కోర్టుకొచ్చి సాక్ష్యం చెప్పడు. ఒకవేళ ఎవడైనా ధైర్యం చేసి కోర్టుకొచ్చి సాక్ష్యం చెప్పినా అడివి అక్కడికక్కడే తెగనరికి దమ్ములుంటే జడ్జీ అయినా సరే బోనెక్కి సత్యం పలికి చూడమని సవాలు చెయ్యగల్ను. నా గురించి మీకు తెలిసిందేవుంటుంది" అన్నాడు కత్తి రాజయ్య ఆవేశంగా.

"కేసు నడిచినప్పుడు సాక్షుల విచారణ జరుగుతుంది. ఈలోగా అరెస్టు కాకుండా బెయిలు తీసుకోవాలన్నా నీ మీద తప్పుడు కేసు పెట్టారని వున్న కేసుని కొట్టించుకోవాలన్నా బలమైన ఎలిబీ కావాలి" అన్నాను.

"ఎలిబి సంపాదించడమంటే ఏమిటి చెయ్యాల" అని అడిగాడతను.

"ఏం లేదు. వెరీ సింపుల్. హత్య జరిగినప్పుడు నువ్వు ఏ హాస్పిటల్‌లోనో వుండి ఆపరేషన్ చేయించుకొంటున్నానని, ఏ అమెరికాలోనో టూరు మీదున్నానని, ఏ జైల్లోనో, రిమాండ్‌లోనో వున్నానని చెబుతూ అందుకు ఆధారాలు తీసుకొస్తే సరిపోతుంది" అని ఎలిబీ అంటే ఏమిటో ఉదాహరణలతో వివరించాను.

"మీ అయిడియా బ్రహ్మాండంగా వుంది సార్! పొద్దున్నే మిమ్మల్ని చూసినప్పుడే అనుకొన్నాను. మిమ్మల్ని మించిన ప్లీడర్ వుండడని. రేపు సాయంత్రానికల్లా నేను మర్డర్ చేసిన రోజు గవర్నమెంట్ హాస్పటల్లో ఆపరేషన్ చేయించుకొంటున్నట్టు సర్టిఫికెట్ పుట్టించుకొస్తాను. ఈ లోగా మీరు కేసుక్కావలసిన కాయితాలు తయారు చెయ్యండి సార్" అని చెప్పి ఫీజు మాట్లాడుకుని అడ్వాన్సుగా కొంత ముట్టజెప్పి వెళ్లిపోయాడు కత్తి రాజయ్య.

గొడ్డొచ్చిన వేళా బిడ్డొచ్చిన వేళా అంటారు. అలాగే నే గుర్రం ఎక్కిన వేళ చాలా మంచిదనుకొంటాను. నేర ప్రపంచానికి నేను రాజఋషి కావడానికి ఇది ప్రారంభ దినమైనందుకు నేను చాలా సంతోషించాను.

కత్తి రాజయ్య చట్టాన్ని గౌరవించే పెద్దమనిషని, అతను ఏ పాపం చెయ్యకుండానే, ఏ నేరానికీ పాల్పడకుండానే, ఏ దారుణానికి ఒడిగట్టకుండానే అతని మీద అన్యాయంగా

ఈ హత్యా నేరం మోపబడిందని నిజానికి అతను హత్య జరగటానికి ముందు రోజే ఎపెండిసైటిస్‌తో హాస్పిటల్లో అడ్మిటయ్యాడని, హత్య జరిగిందని చెప్పబడుతున్న సమయంలో డాక్టర్లు అతనికి ఎపెండిసైటిస్ ఆపరేషన్ చేస్తున్నారని, కాబట్టి న్యాయ వ్యవస్థని అపహాస్యం పాలు కాకుండా కాపాడ్డానికిగానూ నిర్దోషిని కేసు పేరిట కోర్టు చుట్టూ తిప్పి అతని వ్యక్తిగత స్వేచ్ఛని కాల రాయకుండా చూడ్డానికి కోర్టువారు పూనుకొని కత్తి రాజయ్య మీద పెట్టిన కేసు కొట్టి వెయ్యాలని కోరుతూ వాదించాను. ప్రతివాదులు నే చూపిన మెడికల్ సర్టిఫికెట్స్‌ని కాదనలేకపోయారు. దాన్తో కోర్టువారు నా వాదనని ఆమోదించి రాజయ్య మీద కేసు కొట్టివేశారు.

హత్య చేసి కూడా ఒక్క రోజైనా జైలుకు వెళ్లకుండా తప్పించుకొన్న రాజయ్య మీద జనానికి భక్తి పెరిగిపోయింది. అంతకంటే రాజయ్య హత్య చేశాడని తెలిసి కూడా తెలివిగా అతనుహత్య చెయ్యలేదని రుజువు చేసి అతన్ని కేసులోంచే తప్పించేసినందుకు జనానికి నా మీద గురి పెరిగి ఎప్పుడు నాతో ఏ అవసరం పడుతుందోనని నన్ను ఎరిగున్నవాళ్లూ ఎరగని వాళ్లూ కూడా నే కనిపిస్తే చాలు నమస్కారం పెట్టడం మొదలుపెట్టారు.

ఈ దెబ్బతో మా ఇంటి ముందర పార్టీలు క్యూ కట్టడం మొదలుపెట్టారంటే నమ్మండి. సాధారణంగా ఎక్కువ మంది ప్లీడర్లు నయసులో వుండగా రాత్రింబవళ్లూ కష్టపడతారు కానీ ఫలితం వుండదు. నడి వయస్సు వచ్చిన తరువాత ప్లీడర్లకి కష్టానికి తగిన ఫలితం వుంటుంది. వయస్సు మీరినాక కష్టపడకుండానే ఫలితం అనుభవిస్తారు.

అనుకోకుండా నాకొచ్చిన ఒక కేస్‌తో మిగతా ప్లీడర్లందరికీ వయస్సు మీరినాక కలిసొచ్చే అదృష్టం నడి వయస్సులోనే నాకు కలిసొచ్చింది.

రైస్‌మిల్ ఓనర్ సుబ్బయ్య షావుకార్ గోడౌన్లు అధికార్లు అకస్మాత్తుగా తనిఖీ చేశారు. వేలకొద్దీ బస్తాల ధాన్యం రిజిష్టర్‌లో చూపించకుండా అక్రమంగా నిలవేశాడన్న కారణంగా ఆ ధాన్యాన్ని స్వాధీనపర్చుకున్నారు. అయితే స్వాధీనపర్చుకొన్న ధాన్యాన్ని స్టోర్ చెయ్యడానికి గవర్నమెంట్ గోడౌన్లు చాలని కారణంగా సుబ్బయ్య గోడౌన్లలోనే వుంచి, సుబ్బయ్య తాళాలే వేసి గోడౌన్లు సీల్ చేసి సుబ్బయ్య మీద కేసు పెట్టారు అధికార్లు.

యీ దెబ్బతో సుబ్బయ్య షావుకారు యిల్లు కాలిపోయి నెత్తిమీద కూలినట్టుగా కంగారుపడిపోయాడు. హడావుడిగా నా దగ్గరకు పరిగెత్తుకొచ్చి "ఎలాగైనా సరే ఈ ఊబిలోంచి కాపాడి, నా పరువు దక్కించండి. ఈ కేసులో నాకేమైనా అయితే నా పరువు పోవడమే కాక నా యిల్లు కూడా గుల్లయిపోతుంది. వున్న ఆస్తినంతా తెగనమ్మి ధాన్యం నిలువచేశాను" అంటూ కంట తడిపెట్టాడు.


అతన్నించి కేసు వివరాలన్నీ తెలుసుకొని దీర్ఘంగా నిట్టూర్చి "ఫరవాలేదు నేనున్నాను. కేసు నాకు ఒదిలేసి నిశ్చింతగా వుండండి. మీరు మాత్రం ఒక చిన్న పని చేయండి. ఈ రాత్రికి రాత్రి సీలు వేసిన కాగితాలు చిరగకుండా ఊడపీకి గోడవున్లలో రిజిష్టర్లో చూపించినదానికన్నా ఎక్కువ వున్న ధాన్యాన్ని తీసి అక్కడి నుంచి తరలించండి. ఆ తరువాత తాళాలు వేసి సీలు కాగితాలు యథాతథంగా అతికించండి" అని చెప్పాను.

"సార్! సీల్ చేసేప్పుడు స్టాక్ ఎంతుందో నోట్ చేసుకుని వెళ్లానుసార్! ఇప్పుడు తీస్తే పెద్ద గొడవైపోతుందేమోసార్" అని అనుమానం వ్యక్తం చేశాడతను.

"నీ ధాన్యం నీకు రావాలీ, నీకు కేసులోంచి బైటపడాలీ అంటే నే చెప్పినట్లు చెయ్యక తప్పదు" అన్నాను. షావుకారుకు నా మాటలు భరోసా ఇచ్చాయి. ఆరాత్రే నే చెప్పినట్లు అతని గోడౌన్లని అతనే దోచేశాడు. తిరిగి తాళాలు వేసి యథాతథంగా సీళ్లు అతికించాడు. మర్నాడు నే కోర్టులో "సుబ్బయ్య షావుకారు ధాన్యాన్ని దొంగ నిల్వలు చేయలేదని, అతని రిజిష్టర్‌లో చూపినంత మేరకే స్టాక్ వుంచాడనీ, గిట్టని వాళ్లు ఇచ్చిన సమాచారాన్ని ఆధారం చేసుకొని అతనంటే గిట్టని అధికార్లు అతని గోడౌన్లు సెర్చ్ చేసి

ధాన్యం దొంగ నిల్వలు చేశాడని తప్పుడు కేసు పెట్టారనీ, కావాలంటే కోర్టువారు స్వయంగా కానీ, కమిషన్ని నియమించిగానీ, గోడౌన్ల సీళ్లు తెరిచి నిల్వలెన్ని వున్నాయో చూసుకోనవచ్చుననీ" వాదించాను.

నా వాదనలోని నిజా నిజాలు తేల్చుకోవడానికి కోర్టువారు కమిషన్నినియమించారు. కమిషనర్ గోడౌన్లు తనిఖీ చేసి సుబ్బయ్య సెట్టి ఎలాంటి అక్రమాలకీ పాల్పడలేదని నివేదిక సమర్పించాడు. దాంతో సుబ్బయ్య మీద కోర్టువారు కేసు కొట్టేశారు. ఈ విజయంతో ఊళ్లో వున్న షావుకార్లందరికీ నేనే ప్లీడర్నయ్యాను.




సేట్ చమన్‌లాల్ లాంటి వాళ్లూ, కత్తి రాజయ్య లాంటి వాళ్లూ, సుబ్బయ్యసెట్టి లాంటివాళ్లూ, ఇంకా ఇలాంటి వాళ్లు అనేకులు పొద్దున్నే నేనున్నానన్న ధీమాతో లేస్తున్నారు. నన్ను తల్చుకొని భోంచేస్తున్నారు. నేనున్నానన్న భరోసాతో నిద్రపోతు న్నారు. చాపక్రింద నీళ్లలా చల్లగా కార్మికుల్ని దోచుకునే పారిశ్రామికవేత్తలందరికీ కూడా నేను లీగల్ అడ్వయిజర్ నైపోయాను.

నా ఆఫీసులో ఓ ఆరుగురు జూనియర్లు చేరిపోయారు. నే నేసిన కేసుల్లో న్యాయమే తప్ప అన్యాయం వుండదన్న నిర్ణయానికొచ్చేశారు జడ్జీలు. నా కేసుల్లో నే స్వయంగా వాదించకపోయినా కేసు గెలవడానికి నా సంతకం వుంటే సరిపోతుం దనుకునేవారు పార్టీలు.

కేసుకింత ఫీజని కాక నాయిదా కింతని ఫీజు వసూలు చెయ్యడం మొదలు పెట్టాను. అయినా కేసులు తగ్గలేదు. దాంతో ఎక్కువ మందికి న్యాయం మీదా, ధర్మం మీదా వున్న విశ్వాసం కంటే డబ్బుమీదే ఎక్కువ విశ్వాసం వుందని తేలిపోయింది. ఆ డబ్బే వుంటే అమ్మడానికెవరూ సిద్ధంగా లేకపోయినా ఈ దేశాన్ని నే కొనుక్కున్నానని డిక్రీ తెచ్చి చూపించెయ్యగలనన్న ధీమా వుంది చాలా మందికి.

ప్రతిరోజూ కోర్టుకెళ్లేప్పుడు బోయ్‌తో స్టూల్ తెప్పించుకుని దానిపై నుంచి గుర్రం ఎక్కడమూ, ఆ తరువాత దిగేప్పుడు ఏ మెట్లనో, బండరాతినో చూసుకుని దిగడమూ నాకెందుకో నామోషీ అనిపించింది. ఇలా కష్టపడి గుర్రం ఎక్కి కోర్టుకెళ్లే బదులు నా సైజుకు సరిపడా వుండే గాడిదని ఎక్కి వెడితే బాగుంటుందనిపించింది. మొదట్లోనే ఈ పని చెయ్యాల్సింది. కానీ నా చిన్నప్పటి జ్ఞాపకాలు నన్ను ఆ పని చెయ్యనివ్వలేదు. ఇప్పుడు నా అనుభవం అందుకు భిన్నంగా వుంది. దొంగల్నీ, హంతకుల్నీ, బ్లాక్ మార్కెటీర్లనీ గౌరవించే సమాజంలోనూ వాళ్లందర్నీ కాపాడినందుకు నన్ను భక్తితో కొలిచే సమాజంలోనూ డబ్బు తప్ప మరో విలువ ఏదీ మిగల్లేదని తేలిపోయింది. నాలాంటి తెలివైన, పలుకుబడి వున్న, డబ్బున్న ప్లీడర్ కోర్టుకు గుర్రం మీద వెళ్లాల్సిన పని లేదు. గాడిదెక్కి కోర్టుకు వెళ్లినా నిస్సందేహంగా జనం గౌరవిస్తారనిపించింది. అందుచేత మర్నాడు ఒక గాడిదను తెప్పించుకొని దానికి అతి ఖరీదైన సబ్బుతో స్నానం చేయించి, సెంట్ పెర్‌ఫ్యూమ్స్ స్ప్రే చల్లించి పూజ చేయించి దానిమీదెక్కి కోర్టుకు బయలుదేరాను.

దార్లో నన్ను ఎరిగున్నవాళ్లంతా ఈ విషయం పెద్దగా పట్టించుకోలేదు. మామూలుగానే నన్ను గౌరవించారు. రోజూ నాకు ఎదురుపడే ట్రాఫిక్ కానిస్టేబుల్స్ నేను గుర్రం మీద కాక గాడిద మీద సవారీ చేస్తున్న విషయం గమనించకుండా యథావిధిగా నాకు సెల్యూట్ చేసి మిగతా ట్రాఫిక్‌నంతా ఆపేసి నాకు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఆబిడ్స్ సెంటర్‌కి రాగానే సేట్ చమన్‌లాల్ నన్ను చూసి నమస్కరించి "గుర్రం ఎక్కితేనేం, గాడిదెక్కితేనేం! రాజు రాజే అవుతాడు..." అని కొనియా డాడు.

◆